సాక్షి
సంగారెడ్డి

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



కొడుకులనే కడతేర్చారు
వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ తల్లి.. తాగొచ్చి ఇబ్బంది పెడుతున్నాడని ఓ తండ్రి ఇద్దరూ తమ కన్న కొడుకులను హతమార్చారు. 8లో



కాల్ చేసినా.. మెసేజ్ వచ్చినా..
కాల్ చేసినా.. మెసేజ్ వచ్చినా.. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. 8లో



మత సామరస్యానికి ప్రతీక ఉర్సు
మత సామరస్యానికి ఉర్సు ప్రతీకగా నిలుస్తోందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. వెంకటఖ్వాజా దర్గా ఉత్సవాలకు హాజరై ప్రార్థనలు చేశారు. 9లో

న్యూస్‌రీల్

గుండు శివకుమార్‌కు ఐకాన్ జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న గుండు శివకుమార్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు గండు శివ కుమార్ విస్డం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఇండియన్ ఐకాన్ జాతీయ అవార్డు 2023కు ఎంపికయ్యారు. గుండు శివకుమార్ సందర్భాన్ని బట్టి ఇప్పటివరకు దాదాపు 800 వరకు రావి, అశ్వత్థామ, అరటి ఆకులపై చిత్రాలను మలిచారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీహీరో రాజ్‌కాంత్, ట్రస్ట్ అధినేత నాగరాజు, ఉపాధ్యక్షుడు అశోక్ చేతులమీదుగా ధ్రువపత్రంతో పాటు అవార్డును ప్రదానం చేశారు.

జోగిపేటలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, వార్డు కౌన్సిలర్ రేఖా ప్రవీణ్‌లు ప్రారంభించారు. వార్డులో చాలా కాలంగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో 14 ఫైనాన్స్ నిధులతో పనులు చేపట్టారు. నాణ్యతతో పనులు చేపట్టాలని, త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ సుమిత్ర, మాజీ సొసైటీ చైర్మన్ పడిగె సత్యం, కాలనీ కమిటీ సభ్యుడు చిట్యాల మధు పాల్గొన్నారు.

'పీఓటీ 1977 చట్టాన్ని రద్దు చేయాలి'

నారాయణఖేడ్: పీఓటీ 1977 చట్టాన్ని రద్దు చేసి లబ్ధిదారులకే అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలని తెలంగాణ అసైన్డ్ భూముల యజమానుల సంక్షేమ సంఘం అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, అంబేడ్కర్ పూలే సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం డిమాండ్ చేశారు. నిజాంపేట్ మండల కేంద్రంలో సోమవారం అసైన్డ్ భూముల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అసైన్డ్ భూముల లబ్ధిదారులకు సంపూర్ణహక్కులు కల్పిస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 16 లక్షల మంది వద్ద 23లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని తెలిపారు. కొత్త చట్టం తీసుకువచ్చి సంపూర్ణ హక్కులు కల్పించాలన్నారు. ఈ మేరకు నిజాంపేట్ తహసీల్దార్ మదన్‌కు వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్, పూలే సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పండరి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బుకింగ్ ఆదాయం రూ.56 లక్షలు



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి శివరాత్రి బుకింగ్ ఆదాయం సుమారు రూ.56 లక్షలు వచ్చినట్లు సోమవారం ఆలయ అధికారులు తెలిపారు. శనివారం రూ.17,86,106, ఆదివారం రూ.35,09,252, సోమవారం సుమారు రూ.3లక్షల యాభై వేలు వచ్చినట్లు వివరించారు. అర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాద విక్రయాలు తదితర వాటి ద్వారా స్వామి వారి ఖజానాకు సమకూరినట్లు తెలిపారు. గతేడాది శివరాత్రికి బుకింగ్ ఆదాయం కేవలం రూ.36,38,606 వచ్చిందని తెలిపారు.

కొనసాగుతున్న స్థిరీకరణ

వేసవి ముంచుకొస్తున్నా పనుల్లో జాప్యం
- పలు మున్సిపాలిటీల్లో ఇంకా చివరి దశలోనే..
- మార్చి 15లోగా ఇంటింటికీ 'భగీరథ' చేరేనా?



సదాశివపేట పట్టణంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ స్టెబిలైజేషన్ పనులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: 'ఏనుగు వెళ్లింది.. తోక చిక్కింది' అన్న చందంగా తయారైంది మిషన్ భగీరథ పనుల తీరు. గ్రిడ్, ఇంట్రా విలేజ్ పైప్‌లైన్ పనులన్నీ దాదాపు పూర్తి కాగా, ఒకటీ, రెండు మున్సిపాలిటీల్లో మాత్రం ఇంకా అంతర్గత పైప్‌లైన్ పనులు పూర్తికాకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఒకవైపు వేసవి కాలం ముంచుకొస్తున్నప్పటికీ ఇంకా స్థిరీకరణ పేరుతో పనుల్లో జాప్యం జరుగుతుండటం గమనార్హం. సదాశివపేట మున్సిపాలిటీనే ఉదాహరణగా తీసుకుంటే.. ఈ పట్టణంలో అంతర్గత పైప్‌లైన్ స్థిరీకరణ (స్టెబిలైజేషన్) పనులు చేస్తున్నారు. అయితే ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మార్చి 15లోగా ఈ స్టెబిలైజేషన్ పనులను పూర్తి చేసి.. తాగునీటిని సరఫరా చేయాలని జిల్లా ఉన్నతాధికారులు టార్గెట్‌గా పెట్టుకున్నారు. అయితే ఈ మేరకు పనులు మాత్రం జరగడం లేదు. సంగారెడ్డి పట్టణంలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. కలెక్టరేట్ పార్కులో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు ద్వారా పైప్‌లైన్ కనెక్షన్ల పనులు ఇటీవలే పూర్తయినట్లు ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం అధికారులు పేర్కొంటున్నారు.

943 నివాసిత ప్రాంతాలు

- ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్‌భగీరథ తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కొక్కరికి రోజుకు వంద లీటర్లు, మున్సిపాలిటీలో 135 లీటర్లు, నగరాల్లో 150 లీటర్ల చొప్పున ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయాలనే భారీ లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టింది.
- జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 943 నివాసిత ప్రాంతాలున్నాయి. అలాగే సంగారెడ్డి, సదాశివపేట, జోగిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్ పట్టణాలకు కూడా మిషన్‌భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. అయితే 90 శాతానికి పైగా పనులు పూర్తయినప్పటికీ, అక్కడక్కడ ఇంకా స్థిరీకరణ పనులు పూర్తి కాకపోవడం విమర్శలు దారితీస్తోంది. మరో పక్షం రోజుల్లో ఎండల తీవ్రత పెరగనుంది. ఈలోగా స్థిరీకణ పనులు పూర్తి చేస్తే రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మరో 15 నివాసిత ప్రాంతాలకు కూడా..

సదాశివపేట పట్టణంతో పాటు మరో 15 నివాసిత ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. నారాయణఖేడ్ సబ్‌డివిజన్ పరిధిలో నాలుగు నివాసిత ప్రాంతాలు, హత్నూర సబ్‌డివిజన్ పరిధిలో మరికొన్ని నివాసిత ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఆయా నివాసిత ప్రాంతాలకు అంతర్గత పైప్‌లైన్ పనులు పూర్తయినప్పటికీ ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ఈ వేసవిలో తాగునీటి సమస్య ఉండదు

రానున్న వేసవిలో అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశాలే లేవు. సంగారెడ్డి పట్టణంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సదాశివపేట మున్సిపాలిటీలో స్థిరీకరణ పనులు జరుగుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా పట్టణంలో తాగునీటిని సరఫరా చేస్తున్నాం.

– వీరభద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం



బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కర్ణాటకలో బీఆర్ఎస్ పోటీ

నారాయణఖేడ్: రానున్న ఎన్నికల్లో కర్ణాటకలో బీఆర్ఎస్ పోటీ చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బీదర్‌లో సోమవారం నిర్వహించిన శాలివాహనుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీదర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కర్ణాటక ప్రజలు కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీదర్‌లోని గురుద్వార్‌ను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సందర్శించారు. సర్దార్‌జీలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. బీఆర్ఎస్‌లో సిద్దు, పండరి, శర్మ, దిలీప్, నదీన్, జావవిద్, పుండ్లిక్‌రావు, కంటెప్ప, రాము, ఆటోయూనియన్ బాధ్యులు జగన్నాథ్, అయూబ్‌ఖాన్ చేరారు.

వైభవోపేతం.. రథోత్సవం



ఏడుపాయల్లో రథోత్సవం

పాపన్నపేట (మెదక్): రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై, భక్తుల జనదోహం నడుమ ఏడుపాయలలో సోమవారం నిర్వహించిన రథోత్సవం వైభవోపేతంగా సాగింది. దుర్గమ్మ తల్లికి జై అంటూ.. భక్తులు పోటాపోటీగా తాళ్లతో రథాన్ని లాగారు. రథంగోలి వద్ద ప్రారంభమైన రథోత్సవం రాజ గోపురం వరకు సాగింది. ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పాలకవర్గ చైర్మన్ బాలగౌడ్, ఈఓ సార శ్రీనివాస్ తదితరులు దుర్గమ్మ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉదయం నాగ్సాన్ పల్లికి చెందిన సాయి రెడ్డి కుటుంబీకులకు చైర్మన్, ఈఓ, ఎస్ఐలు బొట్టు అందించగా, సాయంత్రం ముదిరాజు కుటుంబీకులు దుర్గమ్మకు నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి పట్టు పరిచి, దీపాలు వెలిగించి, మంత్రాలు పఠించి, గుమ్మడి, కొబ్బరి కాయలు కొట్టారు. వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకొని పులకించిపోయారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బండి సంజయ్, పీఠాధిపతులు, తదితరులు

దత్తగిరిలో బండి సంజయ్ పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతున్న బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రత్యేక పూజలు చేశారు. దత్తగిరి మహారాజ్ శత జయంతి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఆశ్రమానికి వచ్చిన ఆయనకు ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామని అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాల వద్ద అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి, అతి రుద్రం, పూర్ణాహుతి, దత్త హోమం, దత్త యజ్ఞం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఆశ్రమ పీఠాధిపతులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించి, పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ధర్మ సభ జ్యోతి ప్రజ్వలన చేశారు. దత్తగిరి వృద్ధాశ్రమం, వైదిక పాఠశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. దత్తగిరి ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమానికి రూ.5 లక్షలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, మాజీ మంత్రులు బాబూమోహన్, చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, నాయకులు మల్లికార్జున్, పూల సంతోష్, బత్తిని పాండు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 28వ తేదీన సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి రాజేశ్ పేర్కొన్నారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఉపన్యాస తదితర పోటీలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెరిగేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విజ్ఞాన మేళాలు నిర్వహించాలన్నారు.

నేత్రపర్వం.. కల్యాణ మహోత్సవం

కేతకిలో ఘనంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో పచ్చటి తోరణాలు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కల్యాణం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మండపంలో ఉంచి పట్టు వస్త్రాలు, తలంబ్రాలతో అలంకరించారు. కల్యాణానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణములు, మంగళ వాయిద్యాలు, భక్తుల శివ నామ స్మరణల మధ్య కల్యాణ తంతు కొనసాగింది. వేద పండితులు నిర్ణయించిన సుముహూర్తంలో అమ్మవారి మెడలో పరమేశ్వరుడు మాంగల్యధారణ చేశారు. ఈ వేడుకను భక్తిశ్రద్ధలతో కనులారా తిలకించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వదించారు. ఉదయం 4.30 గంటలకు అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వీరభద్రుడి వేషధారణలో ఉన్న గౌరీశంకర్ స్వామి అగ్నిగుండంలో ప్రవేశించగా తర్వాత భక్తులు అనుసరించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, పాలకమండలి చైర్మన్ ఎస్.వెంకటేశం, ఆలయ ఈఓ శశిధర్, సర్పంచ్ జగదీశ్వర్, ఎంపీటీసీ సభ్యురాలు రజినీప్రియ పాటిల్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సునీతా పాటిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింలు, ఎంపీ నాగన్న, నాగేశ్వర్ సజ్జన్, సంగమేశ్వర్, బస్వరాజ్ పాటిల్, సిద్దన్న పాటిల్, భక్తులు పాల్గొన్నారు.



మాంగళ్యాన్ని చూపుతున్న అర్చకుడు



అగ్నిగుండంలో ప్రవేశిస్తున్న గౌరీశంకర్



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

ప్రజావాణికి ప్రాధాన్యం ఇవ్వాలి

- సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి
- కలెక్టర్ డాక్టర్ శరత్
- పలు సమస్యలపై 29 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ప్రజావాణిలో వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 29 అర్జీలు వచ్చాయని, ఆయా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 12 అర్జీలు రాగా, నీటిపారుదల, పంచాయతీ, ఉద్యాన, మహిళ శిశు వికలాంగుల సంక్షేమ, ఎస్సీ అభివృద్ధి, హౌసింగ్, కార్మిక, విద్య, సివిల్ సప్లయీస్, మత్స్య, గిరిజన సంక్షేమ శాఖలకు సంబంధించి 17 అర్జీలు వచ్చాయి. భూ సమస్యల పరిష్కారం, డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు, ఆసరా పింఛన్లు, స్వయం ఉపాధి కల్పనకు రుణం మంజూరు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, నారాయణఖేడ్ సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ ఏఓ, తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా తిరుగుతున్నా..



రెండేళ్ల నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని కంది మండలం జుల్కల్ గ్రామానికి చెందిన సందీప్ రెడ్డి కలెక్టరేట్‌లో వాపోయాడు. తన కున్న పట్టా భూమిలోకి పోనివ్వకుండా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చుట్టూ కాంపౌండ్ కట్టారని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నాడు.

ధరణిలో మా పేర్లు ఎక్కించాలి



మునిపల్లి మండలం ముగుడంపల్లి గ్రామానికి చెందిన సంగయ్యకు నలుగురు కుమారులు. మా తండ్రికి ప్రభుత్వం గతంలో రెండు ఎకరాల ఎనిమిది గుంటలను ఇచ్చింది. మా నాన్న పేరు మీద ఉన్న భూమి ఫుడ్ ప్రాసెసింగ్ కోసం తీసుకుంటున్నామని, నష్టపరిహారం ఇస్తామని చెప్పారు. మా తల్లి, తండ్రి ఇద్దరు చనిపోయారు. వారసత్వంగా ఉన్న భూమి మా నలుగురు కుమారులపై చేయాలని బాలయ్యతో పాటు ముగ్గురు తమ్ముళ్లు కోరారు. పట్టా పాస్ బుక్కులు ఇచ్చి ధరణిలో చేర్చాలని కోరారు.

తాగునీటి సమస్యను తీర్చండి



తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ కొండాపూర్ మండలం రాంపూర్ తండాకు చెందిన గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తాగడానికి మంచి నీటి సౌకర్యం లేదని, మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని వాపోయారు. తండాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, అధికారులు వెంటనే స్పందించాలంటూ కాలి బిందెలతో నిరసన తెలిపారు. నల్లాలను ఏర్పాటు చేయాలని కోరారు.

కేంద్రం నిధులు దుర్వినియోగం

బీజేపీ నాయకుడు రాజశేఖర్



మాట్లాడుతున్న తాళ్లపల్లి రాజశేఖర్

మెదక్ రూరల్: రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఇస్తున్న నిధులను బీఆర్ఎస్ నాయకులు దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు తాళ్లపల్లి రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం హవేలీఘనపూర్ మండలం నాగారంలో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా, కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాల నిధులను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రుణమాఫీ, దళిత బంధు, నిరుద్యోగ భృతి, గిరిజన బంధు అమలు కావడంలేదని, ఎమ్మెల్యేల వైఫల్యంతో నియోజకవర్గాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, నాయకులు బహ్మం, సిద్దిరామాగౌడ్ ఉన్నారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి సోమవారం జరిమానా విధించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా, 15 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన సిద్దిపేట ద్వితీయశ్రేణి న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి రూ.32వేల జరిమానా విధించారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరి మృతి



పెద్దశంకరంపేట(మెదక్): చెరువు సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాలు ప్రకారం..మండల పరిధిలోని బద్దారం గ్రామానికి చెందిన గోండ్ల కృష్ణ (40) ట్రాక్టర్‌పై వెళుతూపెద్ద చెరువు కట్ట ఎక్కిస్తుండగా ఒక్కసారిపై బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భూమమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ సోమేశ్వరి కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని బంధంకొమ్ముకు చెందిన వసంత(30) ఆరేళ్లుగా మానసికస్థితి సరిగ్గా లేక ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలోనే ఈ నెల 14వ తేదీన ఇంట్లో విషం తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం 16న ఇంటికి వచ్చింది. ఆదివారం కడుపునొప్పి రావడంతో మళ్లీ చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందూ అర్ధరాత్రి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లెక్చరర్‌పై యువతి ఫిర్యాదు

దుబ్బాకరూరల్: లెక్చరర్‌పై ఓ యువతి ఫిర్యాదు చేసింది. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన ఒకరు గతంలో దుబ్బాక పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ, బీఈడీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశాడు. ఈ క్రమంలోనే భూంపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో బంధువుల శుభకార్యంలో ఆ లెక్చరర్‌కు పరిచయం ఏర్పడింది. బీఈడీ సీటు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఆమెకు దగ్గరయ్యాడు. ఆరు నెలలుగా ఆ యువతిని శారీరకంగా లోబర్చుకున్నాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపగా ఈనెల 18న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది. నిందితుడు పోలీస్ కస్టడీలో ఉన్నట్లు సమాచారం.

ఐటీఐ కాలేజీలో చోరీ

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలోని ఐటీఐ కాలేజీలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, కళాశాల ఇన్‌చార్జ్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం...శుక్రవారం సాయంత్రం సిబ్బంది కళాశాలకు తాళం వేసి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం కళాశాలకు వచ్చేసరికి కార్యాలయ తాళం పగులగొట్టి ఉంది. కంప్యూటర్ సీపీయూ, స్కానర్, నెట్ వైఫై రూటర్, సెల్‌ఫోన్ చోరీ అయ్యాయి.

కొడుకులనే కడతేర్చారు

తమ బంధానికి అడ్డొస్తున్నాడంటూ ఓ తల్లి
- ప్రియుడితో కలిసి ఘాతకం
- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు



అక్షయ్ రాథోడ్ మృతదేహం

జహీరాబాద్: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ఓ తల్లి తన ప్రియుడితో కలిసి కుమారుడినే హత మార్చింది. మొదటగా యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని అనుకున్న పోలీసులు.. 24 గంటల్లోనే ఆ కేసు మిస్టరీని ఛేదించారు. సోమవారం సీఐ భూపతి ఆ వివరాలను వెల్లడించారు. హోతి(కె) గ్రామానికి చెందిన యశోదబాయి భర్త చనిపోవడంతో అదే గ్రామానికి చెందిన ప్రేమ్‌దాస్‌తో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. యశోదబాయి కూలీ పనులు చేస్తుండగా, అక్షయ్ రాథోడ్(25) ఆటో నడుపుతున్నాడు. వీరు జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్నారు. ప్రేందాస్‌తో ఉన్న వివాహేతర సంబంధంపై కుమారుడు తరచు అభ్యంతరం చెబుతూ వస్తున్నాడు. దీంతో అక్షయ్‌ను ఎలాగైనా కడతేర్చాలని అనుకున్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం..ఆదివారం యశోదబాయి, ప్రేందాస్‌లు ఇంట్లోనే అక్షయ్ రాథోడ్‌ను రోకలి బండతో తలపై మోదడంతో పాటు లుంగీతో గొంతుకు బిగించి హత్య చేసి పారిపోయారు. అక్షయ్‌కు భార్య సుజాతతో వచ్చిన మనస్పర్థల కారణంగా కొంత కాలంగా ఆమె తన తల్లి గారింట్లో ఉంటోంది. అక్షయ్ హత్యకు గురైన విషయం తెలుసుకున్న కాలనీవాసులు సుజాతకు సమాచారం అందించారు. వెంటనే ఆమె జహీరాబాద్ చేరుకుని మార్చురీలో భర్త శవాన్ని చూసి, సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించింది. సోమవారం ఉదయం అక్షయ్ భార్య సుజాత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన అత్త యశోదబాయి ప్రేమ్‌దాస్‌లే హత్య చేశారని ఆరోపించింది. ఈ మేరకు సీసీ పుటేజీల ఆధారంగా యశోదబాయి, ప్రేందాస్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా, చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు సీఐ భూపతి వెల్లడించారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.



యశోదబాయి, ఆమె ప్రియుడు ప్రేందాస్‌లతో పోలీసులు

ఆ తల్లికి కొడుకన్న కనికరమే లేదు.. తన వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి హతమార్చింది. కొడుకు చేష్టలతో ఓ తండ్రి విసిగిపోయాడు. చంపడం తప్ప తనకు మరోదారి లేదని అంతమొందిచాడు.

తాగొచ్చి ఇబ్బంది పెడుతున్నాడంటూ ఓ తండ్రి
- కేసు తప్పుదోవ పట్టించే యత్నం..
- వీడిన గిర్మాపూర్ హత్య మిస్టరీ



నిందితుడు సాయి మల్లయ్యతో ఎస్‌ఐ సంపత్‌కుమార్, గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖరరెడ్డి

వర్గల్(గజ్వేల్): తాగుడుకు బానిసైన కొడుకు చేష్టలతో విసిగిపోయాడు. తాగిన మత్తులో కొడుకు పెట్టే చిత్రహింసలు భరించలేక పోయాడు. ఆ బాధల నుంచి శాశ్వత విముక్తి కోసం గుండెను రాయి చేసుకున్నాడు. కన్నతండ్రే కర్రతో బాది కొడుకును హతమార్చాడు. ఆ తర్వాత తన కొడుకును ఎవరో చంపేశారంటూ కట్టుకథ అల్లి హత్యకేసును పక్కదోవ పట్టించే యత్నం చేశాడు. కానీ పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. కేసు వివరాలను గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్‌లు సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల పరిధిలోని గిర్మాపూర్‌కు చెందిన డ్యాగ జహంగీర్(42) తాగుడుకు బానిసయ్యాడు. పనేమి చేయకుండా ఖాళీ సీసాలు ఏరుకుంటూ వచ్చిన డబ్బుతో మద్యం తాగేవాడు. తాగినమత్తులో ఇంటికి వచ్చి చిన్నచిన్న విషయాలకు పెద్ద గొడవ చేసేవాడు. ఇతని ప్రవర్తనతో విసిగిన భార్య తన పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరిగా ఉంటున్న జహంగీర్ తాగుడు మానలేదు. తాగిన మత్తులో ఇంటికొచ్చి తల్లిదండ్రులను దూషించేవాడు. చుట్టుపక్కల వారు ఇదేంటని ప్రశ్నిస్తే వారిని నానా బూతులు తిట్టేవాడు. రెండు, మూడుసార్లు గొడ్డలితో తండ్రిపై దాడి యత్నం చేశాడు. ఎన్నిసార్లు చెప్పినా జహంగీర్‌లో మార్పు రాలేదు. అతని బాధపడలేక సోదరులు రవి, సంతోష్‌లు బతుకుదెరువు కోసం వేరే గ్రామాలకు వెళ్లిపోయారు. కొడుకు చేష్టలతో గ్రామంలో చులకన వుతున్నామని, అతని బాధల నుంచి శాశ్వతంగా బయటపడాలని తండ్రి సాయిమల్లయ్య నిర్ణయించుకున్నాడు. ఈ నెల 15న మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో చిత్తుగా మద్యం తాగి తన గదిలో సోయిలేకుండా పడుకున్న జహంగీర్‌ను తండ్రి గమనించాడు. ఇదే అదునుగా భావించి చుట్టుపక్కల ఎవరూ లేనిసమయం చూసి నిద్రిస్తున్న కొడుకును దొడ్డు కర్రతో మెడ, ముఖం, భుజం మీద మోది హతమార్చాడు. ఆ తర్వాత తనకేమీ తెలియనట్టు పోలీసులను పక్కదోవ పట్టించి కేసు నుంచి బయటపడేందుకు యత్నించాడు. 'గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి తన కొడుకును చంపినట్టు చెప్పి వెళ్లారని' కట్టు కథ అల్లి అందనీ మభ్యపెట్టే ప్రయత్నం చేశాడు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ సంపత్‌కుమార్‌లు వివిధ కోణాల్లో జరిపిన విచారణలో తండ్రి సాయిమల్లయ్య నిందితుడని తేలింది. కొడుకు జహంగీర్ బాధలు భరించలేక తానే హత్యచేశానని నిందితుడు సాయిమల్లయ్య ఒప్పుకున్నాడని, అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని వారు చెప్పారు.

అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత



రుస్తుంపేట కమాన్ సమీపంలో నిర్మిస్తున్న వ్యాపార డబ్బాలను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు



నర్సాపూర్‌లోని ఈద్గా, శ్మశాన వాటికల వద్ద పరిశీలిస్తున్న ముస్లింలు

నర్సాపూర్: నర్సాపూర్‌లో ఈద్గా, శ్మశాన వాటిక స్థలాలను ఆక్రమించి అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను సోమవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూల్చివేశారు. అక్రమ కట్టడాలపై పట్టణానికి చెందిన మౌలానా ఖాజీ మసీయొద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్ ఫిర్యాదు చేయగా, అధికారులు వాటిని సిబ్బందితో తొలగించారు. తహసీల్దార్ ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, ఎస్‌ఐ శివకుమార్‌ను కలిసి ఆక్రమణల నుంచి ఈద్గా, శ్మశానవాటిక భూమిని కాపాడాలని కోరుతూ నయిమోద్దీన్, ఖాజీ మసీయొద్దీన్ వినతి పత్రం అందించారు.

అనుమతి లేని డబ్బాలను తొలగించాం

రుస్తుంపేట కమాన్ వద్ద అనుమతి లేకుండా నిర్మించిన వ్యాపార డబ్బాలను తొలగించామని తహసీల్దార్ ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో విచారణ చేసి వాటిని తొలగించినట్లు పేర్కొన్నారు. వక్ఫ్ భూమి, స్మశాన వాటిక, ఈద్గా భూమికి సర్వే చేయించి హద్దులు నిర్ణయిస్తామన్నారు.

అనుమతులు ఉన్నా కూల్చివేశారు

పట్టా భూమిలో డబ్బాలు ఏర్పాటు చేస్తుకున్నామని, ఎవరి స్థలం ఆక్రమించలేదని పట్టణానికి చెందిన అశోక్‌యాదవ్, సత్యనారాయణయాదవ్ తెలిపారు. పంచాయతీగా ఉన్న సమయంలో తీసుకున్న అనుమతులు ఉన్నాయని వారు చెప్పగా, అవి చెల్లవని అధికారులు అన్నారు. సర్వే చేయకుండా అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు.

రియల్టర్ల మట్టి దందా



తపాస్‌పల్లి గ్రావిటి కెనాల్ నుంచి మట్టిని తరలిస్తున్న దృశ్యం

కొమురవెల్లి(సిద్దిపేట): చెరువులు..కాలువ గట్లు, ప్రభుత్వ, ప్రైవేట్ భూమి అన్న తేడా లేదు.. మట్టిని ఉందని తెలిస్తేచాలు గద్దల్లా వాలిపోతున్నారు. వెంచర్లకు ట్రాక్టర్ల కొద్ది మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ కింద కెనాల్ గట్టు వెంట ఉన్న మట్టిని ఐనాపూర్‌కు చెందిన కొంత రియల్టర్లు జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో వెంచర్లకు తరలిస్తున్నారు. రెండుమూడు రోజులుగా మట్టిని తరలిస్తున్నా అధికారులు స్పందించడం లేదు. అయితే మట్టి తరలింపు విషయం తమ దృష్టికి వచ్చిందని ఇరిగేషన్ ఏఈ రాజశేఖరరెడ్డి చెప్పారు. వెంటనే మట్టి తరలింపును అడ్డుకున్నామని, మళ్లీ ఎవరైనా ఇలాంటి పని చేస్తే కేసులు పెడతామన్నారు.

ఇద్దరికి జైలుశిక్ష



జహీరాబాద్: దుకాణంలో అక్రమంగా చొరబడి ఫర్నిచర్ ధ్వంసం చేసి దాడి చేసిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జి.అనూష సోమవారం తీర్పు చెప్పినట్టు సీఐ భూపతి తెలిపారు. 2016 ఆగస్టు 17వ తేదీన కె.నవీన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ కె.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన నవీన్‌కుమార్ జి.మనీష వద్ద ప్లాట్ కొనుగోలు చేశాడు. ఈ విషయాన్ని మనుసులో పెట్టుకున్న జి.విజయ్‌కుమార్, అతని కుమారుడు రాజేంద్రప్రసాద్‌లు ఫిర్యాదిదారుడి దుకాణంలో అక్రమంగా చొరబడి సామాన్లను బయట పడవేశారు. అద్దాలు పగులగొట్టి దాడి చేశారు. కేసుకు సంబంధించి పూర్వాపరాలు విన్న అనంతరం నేరం రుజువు కావడంతో ఇద్దరికి మూడునెలల సాధారణ జైలుశిక్ష, ఒకొక్కరికి రూ.5,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎంత పని చేశావ్ అమ్మా!

పుట్టిన బిడ్డలందరూ అల్పాయుష్కులేనని ఆవేదన

- కొన్నాళ్ల క్రితం ముగ్గురు చిన్నారుల మృతి
- మేనరికపు పెళ్లి కారణంగానే పిల్లలకు అనారోగ్యం
- మాతృమూర్తిగా భరించలేనంటూ కఠిన నిర్ణయం
- ఇద్దరు పసికందులను సంపులో వేసి తల్లి ఆత్మహత్య
- ఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్



విగతజీవులుగా తల్లి, ఇద్దరు పసికందులు



సంధ్యారాణి (ఫైల్)

అల్వాల్: కడుపున పుట్టిన ముగ్గురు బిడ్డలూ అల్పాయుష్షుతోనే కన్నుమూశారు. ప్రస్తుతం జన్మించిన కవలలూ అనారోగ్యానికి గురయ్యారు. మేనరికపు పెళ్లి కారణంగానే పిల్లలు ఆయుర్దాయం లేకుండా చనిపోతున్నారని ఆవేదనకు గురైంది ఆ తల్లి. భవిష్యత్‌లో తాను మాతృమూర్తిగా మనగలిగే పరిస్థితి ఉండదని భావించిన ఆమె పదిరోజుల వయసున్న పసికందులను ఇంటి ఆవరణలోని సంపులో పడేసి తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాజీగూడ శివనగర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

- మెదక్ జిల్లాకు చెందిన నర్సింగ్‌రావుకు మేనమామ కూతురు సంధ్యారాణితో 2012లో వివాహమైంది. 5 సంవత్సరాల అనంతరం ఇద్దరు కవల పిల్లలు జన్మించి అనారోగ్యంతో చనిపోయారు. 2018లో పుట్టిన కొద్ది రోజులకే కూతురు మరణించింది. అనంతరం ఈ నెల 11న ఇద్దరు కవల (మగ, ఆడ) పిల్లలు జన్మించారు. వీరు సైతం అనారోగ్యానికి గురయ్యారు. బాబుని కొంపల్లిలోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. 14వ తేదీన ఇంటికి తీసుకొచ్చారు. పుట్టిన పిల్లలందరూ అనారోగ్యానికి గురవుతూ మృత్యువాత పడుతుండడం.. ఈ ఇద్దరు పసికందులు కూడా దక్కకుండాపోతారేమోనని భావించిన సంధ్యారాణి.. ఆదివారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న సంపులో వారిని పడేసి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడింది.
- ఇంట్లో అర్ధరాత్రి సంధ్యారాణి కనిపించకపోడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి పరిసరాలను పరిశీలిస్తూ సంపులో వెతకగా సంధ్యారాణి, ఇద్దరు పిల్లల మృతదేహాలు సంపులో కనిపించాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మేనరికపు పెళ్లి వల్లే పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని భావించి ఈ ఘాతుకానికి పాల్పడుతున్నట్లు రాసి ఉన్న సూసైట్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ఈ ఘటనపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఇంట్లో ఉన్న సంపు

ఖదీర్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



ఖదీర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

దళిత, ప్రజా సంఘాల డిమాండ్.. మృతుడి కుటుంబానికి పరామర్శ

మెదక్‌జోన్: పోలీసుల చిత్రహింసలతోనే ఖదీర్ చనిపోయాడని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బహుజన ముక్తి పార్టీ, దళిత బహుజన ఫ్రంట్, లంబాడ హక్కుల పోరాట సమితి, జాతీయ మాలమహానాడు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అన్సారీ, ప్రకాశ్ రాథోడ్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, మాల మహానాడు జాతీయ నాయకులు కల్లూరి సంజీవ్, ప్రసాద్, ఇసాక్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు సురేష్, గోపాల్, మానవ హక్కుల వేదిక నేత అహ్మద్ తదితరులు ఖదీర్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం లక్ష్మణ్, శంకర్ మాట్లాడుతూ ఘటనకు బాధ్యులైన పోలీసులపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని, సస్పెండ్ తో సరి పెట్టకుండా సర్వీస్ నుంచి తొలగించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ పేరుతో సామాన్యులను చిత్ర హింసలకు గురి చేయడం సరికాదని, ఇప్పటికైనా పోలీసుల తీరు మార్చుకోవాలని అన్నారు. ఖదీర్ కుటుంబాన్ని హోం మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ పరామర్శించి, రూ.50 లక్షల పరిహారం అందించి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఘటనపై డీఎస్పీ సైదులుతో మాట్లాడి, కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రంజిత్, సంతోష్, ప్రేమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్ చేసినా... మెసేజ్ వచ్చినా

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సిద్దిపేట సీపీ శ్వేత
- 24 గంటల్లోనే రూ.9,99,562 ఫ్రీజ్



సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్ల నుంచి కాల్స్, మెసేజ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌కు చెందిన తరుణ్‌తేజ్ వాట్సాప్‌నకు గుర్తు తెలియని నంబరు నుంచి పార్ట్‌టైం జాబ్ ఉందని, వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోమని ఓ మెసేజ్ వచ్చింది. టెలిగ్రామ్ ద్వారా ఇన్వెస్టిమెంట్ చేస్తే సులభంగా కమీషన్ వస్తుందని చెప్పగా, నమ్మిన బాధితుడు రూ.9,76,240 ఇన్వెస్ట్‌మెంట్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

- సిద్దిపేట పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన రవీందర్‌రెడ్డికి గుర్తు తెలియని వ్యక్తి ఇండియా బుల్స్ నుంచి ఫోన్ చేస్తున్నాను... మీకు లోన్ మంజూరైంది.. ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత డబ్బులు చెల్లించాలని సైబర్ నేరస్తుడు నమ్మించాడు. దీంతో రవీందర్‌రెడ్డి గుర్తు తెలియనివ్యక్తికి ఆన్‌లైన్‌లో రూ.18,422 చెల్లించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్టు గుర్తించి బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేశాడు.
- సిద్దిపేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన అప్సా పర్వీన్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్లూడార్ట్ నుంచి డెలివరీ ఉంది..మీ ప్రొఫైల్ అప్‌డేట్ చేయకపోవడంతో ఆ వస్తువు డెలివరీ కావడం లేదని మాయమాటలు చెప్పి నమ్మించింది. తాను చెప్పిన ఫైల్ డౌన్‌లోడ్ చేసుకుంటే వస్తువు డెలివరీ అవుతుందన్నాడు. దీంతో సైబర్ నేరగాడు పంపించిన ఫైల్‌ను తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోగానే, ఆమె ఖాతా నుంచి రూ.4,900 డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో తాను మోసపోయినట్టు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు ఫిర్యాదు చేశారు.

ఈ మూడు ఘటనల్లో వెంటనే స్పందించిన పోలీసులు సైబర్ నేరం జరిగిన 24 గంటల్లో రూ.9,99,562 ఫ్రీజ్ చేశారని సీపీ శ్వేత తెలిపారు. సైబర్ నేరం జరిగిన వెంటనే లేదా 24గంటల్లోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.